క్లుప్తంగా

కొత్తమ్మవారికి పూలమాలలతో అలంకరణ



అలంకరణలో కొత్తమ్మవారు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ సంతపేట, కొత్తపేట, కొండపేట, వెలంపేట, విల్సన్‌పేట, ఆదర్శనగర్ గ్రామాల ఆరాధ్యదేవత కొత్తమ్మతల్లిని మంగళవారం స్థానికులు పూలమాలలతో అలంకరించారు. సంతపేటకు చెందిన రాయల్ రెడ్డి యూత్ ప్రతినిధులు జీరు సంతోష్‌రెడ్డి, డి.యశోదరెడ్డి, కె.సోమేశ్వర్ అందించిన సహకారంతో సన్నజాజులు, కనకాంబరాలు, తులసిమాలలతో అమ్మవారి విగ్రహంతోపాటు ఆలయాన్ని అలంకరించారు. భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, వెంపాడ రామిరెడ్డి, చిట్టిబాబు అమ్మవారిని అలంకరించారు. యువకుల ప్రయత్నాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు అభినందించారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవం



పూజలందుకున్న భూలోకమ్మవారు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ దరి గుడ్లవానిపాలెం గ్రామ దేవతలు భూలోకమ్మ, ముత్యాలమ్మ, పోలమాంబ అమ్మవార్ల ఆలయ వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఇక్కడ అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

బాలుడి అదృశ్యం



మధురవాడ: బాలుడి అదృశ్యంపై మంగళవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. మారికవలసకు చెందిన మైచర్ల యశ్వంత్ (15) చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. గత నెల 25న స్కూల్‌కు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. యశ్వంత్ తండ్రి కృష్ణ ఆర్టీసీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అనేక ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



కూల్చివేసిన అక్రమ నిర్మాణం

భీమునిపట్నం: భీమిలి సమీప కుమ్మరిపాలెం వలంద భూములు ప్రాంతంలోని లే అవుట్‌లో అక్రమ నిర్మాణాన్ని అసిస్టెంట్ సిటీ ప్లానర్ డి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో సిబ్బంది మంగళవారం కూల్చివేశారు. ఇక్కడి జీపీఆర్ హౌసింగ్ లే అవుట్‌లో నిబంధనల ప్రకారం ఖాళీగా ఉంచాల్సిన ప్రాంతంలో నిర్మాణం చేపట్టగా విషయం తెలుసుకున్న అధికారులు దాన్ని కూల్చేశారు. దీనిపై ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి లే అవుట్‌లోనూ తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టౌన్‌ప్లానింగ్ అధికారి కె.ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

తగరపువలస: దోమల నివారణలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం జీవీఎంసీ భీమిలి జోన్ పారిశుధ్య సిబ్బంది చిట్టివలస, తగరపువలస గ్రామాల్లో ఫాగింగ్ చేపట్టారు. జోన్‌లో దోమల విజృంభణ కారణంగా ఇటీవల పలువురు భీమిలి జోన్‌లో ఫిర్యాదులు చేస్తున్న నేపథ్యంలో ఇకపై ప్రతీవారం ప్రతీ గ్రామంలో ఫాగింగ్ చేపట్టనున్నట్టు పారిశుధ్య సిబ్బంది తెలిపారు.

నీరు మళ్లింపునకు ప్రత్యామ్నాయ చర్యలు



హైవే డ్రైనేజీని ఆనుకుని తవ్వుతున్న అనుసంధాన కాలువ



శ్రీబాసర లే అవుట్ నుంచి తవ్వుతున్న మరో కాలువ

- హైవే డ్రైనేజీని ఆనుకుని కాలువ తవ్వకం
- బాలాజీనగర్ – వేంకటేశ్వరమెట్ట వద్ద మరో కాలువ
- సర్వీసు రోడ్లపై నీటి నిల్వ సమస్యకు పరిష్కారం

తగరపువలస: స్థానిక సర్వీస్ రోడ్లపై నెలల తరబడి నిలిచిపోతున్న మురుగు, వర్షం నీటిని దారి మళ్లించేందుకు జీవీఎంసీ అధికారులు ప్రత్యామ్నాయ ఉపాయాలు ఆలోచించారు. ఇటీవల జీవీఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సాయికాంత్ వర్మ చొరవతో హైవే డ్రైనేజీని ఆనుకుని కాలువతోపాటు బాలాజీనగర్ – వేంకటేశ్వరమెట్ట వద్ద ఉన్న బందకు మరొక కాలువ తవ్వుతున్నారు. దీనికోసం హైవే డ్రైనేజీని ఆనుకుని ఉన్న ఆక్రమణలను యంత్రాలతో తొలగిస్తున్నారు. చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఒక దుకాణదారుడు ఆక్రమణల తొలగింపునకు అడ్డురాగా హైవే అధికారులు మంగళవారం రంగంలోకి దిగారు. హైవే డ్రైనేజీని ఆనుకుని మూడు మీటర్ల వరకు తమకే హక్కు ఉందని, ప్రత్యామ్నాయ కాలువ నిర్మాణానికి తొలగింపులు తప్పవని హెచ్చరించారు. సర్వీస్‌రోడ్డుపై నిలిచిపోతున్న వర్షం, మురుగునీటి కారణంగా ఇటీవల వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల వినతి మేరకు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సర్వీస్‌రోడ్డుపై నీరు నిలవకూడదని సీరియస్‌గా తీసుకున్నారు. వివిధ శాఖల అధికారులను పరుగులు పెట్టిస్తున్నారు.

హైవేపై డస్ట్‌బిన్లు కనిపించకూడదు : ఇటీవల తగరపువలసలో పర్యటించిన జీవీఎంసీ కమిషనర్ వర్మ రామన్నపేట వద్ద హైవేపై డస్ట్‌బిన్లు చూసి అసహనం వ్యక్తం చేశారు. చెత్త సేకరణకు ఇంటింటా క్లాప్ వాహనాలు వస్తుండంగా ఇంకా డస్ట్‌బిన్లు ఎందుకని తొలగింపజేశారు. సర్వీస్‌రోడ్లపై కూడా పారిశుధ్య పనులు సజావుగా సాగాలని సూచించారు. అలాగే సర్వీస్ రోడ్డుపై నిలిచిన నీటిని సత్వరమే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా హైవే ఇంజినీరింగ్ అధికారులను కూడా పిలిపించి నిర్మాణ సమయంలో లోపభూయిష్టంగా ఉన్న డ్రైనేజీలను సరిచేయించడంతోపాటు పూడిక తొలగించాలని సూచించారు. దీంతో హైవే డ్రైనేజీలను ఆనుకుని అవసరమైన చోట మూడు మీటర్లు వరకు స్థలం జీవీఎంసీకే చెందుతుందని, ఆ మేరకు ప్రత్యామ్నాయ డ్రైనేజీల నిర్మాణానికి సూచనలు చేశారు.

వీఎల్‌టీ ఎగ్గొడుతున్న బిల్డర్లు

- జీవీఎంసీకి రూ.కోట్లలో ఆస్తిపన్ను బకాయిలు
- వసతులు లేక ప్లాట్ల కొనుగోలుదారులకు అవస్థలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లో నిర్మితమైన అపార్ట్‌మెంట్ల యజమానుల నుంచి ఏళ్ల తరబడి వీఎల్‌టీ (ఖాళీ స్థలం పన్ను) బకాయిలు రూ.కోట్లలో పేరుకుపోయాయి. దీంతో వీటిలో ప్లాట్ కొనుగోలు చేసిన వారికి జీవీఎంసీ ఆస్తిపన్ను విధించలేకపోతోంది. అంతేకాకుండా వీఎల్‌టీ బకాయిలు ఉన్న అపార్ట్‌మెంట్లకు వసతులు కూడా కల్పించలేమని అధికారులు అంటున్నారు. అపార్ట్‌మెంట్లు నిర్మించిన బిల్డర్లు అధిక ధరలకు ప్లాట్లు విక్రయించిన తర్వాత రోడ్లు, డ్రైనేజీ, ఇతర వసతులు కల్పించడం లేదు. ప్లాట్ల కొనుగోలుదారులకు సైతం నిబంధనలు తెలియక తమ అపార్ట్‌మెంట్లకు రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, వీధిదీపాలు ఏర్పాటు చేయాలని జీవీఎంసీ చుట్టూ తిరుగుతున్నారు. తీరా అక్కడకు వచ్చాక... అధికారుల వివరణతో ప్లాట్ల కొనుగోలుదారులు మోసపోయామని గ్రహిస్తున్నారు. ప్లాట్లు కొనుగోలుదారులకు బిల్డర్లు అన్ని వసతులు కల్పించి వీఎల్‌టీ చెల్లిస్తే జీవీఎంసీ పన్నులు విధించి పారిశుధ్యం, తాగునీరు, వీధిదీపాలు వంటి నిర్వహణ బాధ్యత మాత్రమే చేపడుతుందని వివరణ ఇస్తున్నారు. మంగళవారం తగరపువలస శ్రీబాసర లే అవుట్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌కు చెందిన యజమానులు భీమిలి జెడ్సీ రామును కలిసి తమకు జీవీఎంసీ నుంచి వసతులు కల్పించడం లేదని, పన్నులు విధించడం లేదని మొరపెట్టుకున్నారు. దీంతో సచివాలయ సిబ్బంది స్పందించి సదరు అపార్ట్‌మెంట్ బిల్డర్ జీవీఎంసీకి రూ.12 లక్షల వీఎల్‌టీ బకాయి ఉన్నట్టు తెలిపారు. దీంతో జెడ్సీ మాట్లాడుతూ వీఎల్‌టీ చెల్లిస్తేనే పన్నులు విధించడం, వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. సదరు బిల్డర్‌తో మాట్లాడడమో లేదా మాట్లాడించడమో చేస్తే వీఎల్‌టీ వసూళ్లు చేసుకుంటామన్నారు. దీంతో ప్లాట్లు యజమానులు మాట్లాడుతూ బిల్డర్ తమకు అందుబాటులో లేడన్నారు. కనీసం బిల్డర్ ఫోన్ నంబరైనా ఇస్తే పరిశీలిస్తామని జెడ్సీ హామీ ఇచ్చారు. ఇలాంటి బిల్డర్లు భీమిలి జోన్‌లో పదుల సంఖ్యలో ఉన్నారు. సబ్బివానిపేట, సంగివలస, నమ్మివానిపేట, చిట్టివలస, వలందపేట గ్రామాల్లో చాలా మంది బిల్డర్లు అపార్ట్‌మెంట్లకు వసతులు కల్పించకుండా, వీఎల్‌టీ చెల్లించకుండా అటు ప్లాట్లు కొనుగోలు చేసుకున్న యజమానులను, జీవీఎంసీని మోసం చేస్తున్నారు. దీంతో జీవీఎంసీకి రూ.కోట్లలో ఆస్తిపన్ను, వీఎల్‌టీ బకాయిలు పేరుకుపోయాయి. ప్రత్యేక డ్రైవ్ ద్వారా బకాయిదారుల నుంచి వసూళ్లు చేయాలని ప్లాట్ల కొనుగోలుదారులు కోరుతున్నారు.

ఘనంగా దేవర సంబరం



సాము గరిడీ తిలకిస్తున్న గ్రామస్తులు

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో పైడితల్లమ్మ ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి దేవర సంబరం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఇంటి నుంచి అమ్మవారిని గ్రామంలోకి తీసుకొచ్చారు. నూకాలమ్మ తల్లికి పసుపు కుంకుమ సమర్పించారు. కర్ర సాము, కత్తి సాము, గరిడీల మధ్య దేవర సంబరం నిర్వహించారు. చిన్నారి కడుపుపై పెట్టిన అరటికాయను కత్తి సాము గరిడీలో భాగంగా నరకడం గగుర్పాటు కలిగించింది. రాత్రి ఎనిమిది గంటలకు ప్రారంభమైన దేవర సంబరం ఒంటి గంట వరకు జరిగింది.

8 నుంచి సమ్మర్ క్యాంప్

కొమ్మాది: బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ నేతృత్వంలో నితాయి సేవిని మాతాజీ ఆధ్వర్యంలో వాల్తేర్ డివైన్ టచ్ స్కూల్ క్యాంపస్‌లో ఈ నెల 8వ తేదీ నుంచి 22 వరకు మూడు సంవత్సరాల నుంచి 15 ఏళ్ల వరకు గల బాల బాలికలకు సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా రోజూ ఉదయం 9 గంటల నుంచి 12 .30 వరకు యోగా, ధ్యానం, భగవద్గీత శ్లోకాలు, సంగీతం, నాటికలు, రామాయణ, మహాభారత గ్రంథాల నుంచి రకరకాల కథలపై చర్చ, ఫీల్డ్ ట్రిప్, స్కేటింగ్, క్రాఫ్ట్ ఆర్ట్, ఏరోబిక్స్‌పై పిల్లలకు శిక్షణ ఇవ్వనున్నారు. అదేవిధంగా పిల్లలకు రోజూ మధ్యాహ్నం భోజనం , రవాణా సదుపాయం కలదు. పూర్తి వివరాలకు 0891 2592233, 91005 56290 నంబర్లలో సంప్రదించగలరు.

'యూజర్ చార్జీల వసూళ్లు పెంచండి'



బాలాజీనగర్ సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్సీ రాము

తగరపువలస: చెత్త సేకరణకు సంబంధించి ప్రజల నుంచి యూజర్ చార్జీల వసూళ్లు పెంచాలని భీమిలి జెడ్సీ బొడ్డేపల్లి రాము సచివాలయ సిబ్బంది, వలంటీర్లను కోరారు. బాలాజీనగర్ సచివాలయం పరిధిలో మంగళవారం ఆయన పర్యటించారు. ఇక్కడ యూజర్ చార్జీల వసూళ్లు కేవలం 30 శాతం మాత్రమే ఉన్నాయన్నారు.

వలంటీర్లు, సచివాలయ సిబ్బంది చొరవ తీసుకుని వసూళ్లను 50 శాతానికి పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో క్లాప్ వాహనంతోపాటు అయిదుగురు పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారన్నారు. చెత్త సేకరణ, పారిశుధ్య పనులకు ఇబ్బంది కలగకుండా భీమిలి జోన్‌లో అదనంగా మరో 30 మంది సిబ్బందిని తీసుకున్నామన్నారు. రోడ్లు, డ్రైనేజీలపై ఎక్కడా చెత్త కనిపించకూడదన్నారు. ప్రతి ఇంటికి క్లాప్ వాహనం వస్తున్నందున తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేరుచేసి వాహన సిబ్బందికి అందజేయాల్సిన బాధ్యత ఆ ఇంటి వారిదేనన్నారు. ఆ దిశగా శానిటేషన్ కార్యదర్శులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహాలక్ష్మినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యం ప్రజల్లోనే వైఎస్సార్ సీపీ నాయకులు



పీఎం పాలెంలో లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: గతంలో సమస్యల పరిష్కారం కోసం నాయకులు, అధికారుల చుట్టూ ప్రజలు తిరగాల్సి వచ్చేదని... ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించమని ఇళ్ల వద్దకే నాయకులను, అధికారులను పంపిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం సాయంత్రం జీవీఎంసీ 6వ వార్డు పీఎంపాలెం ఆఖరి బస్టాప్‌లోని సిద్ధార్థ లే అవుట్, షిప్‌యార్డు కాలనీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీల్లో ఇళ్లు, అపార్ట్‌మెంట్లలోకి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని, ప్రభుత్వం ద్వారా వారికి జరిగిన మేలుకు సంబంధించిన పత్రాలు అందించారు. ఈ సందర్భంగా తనకు జగనన్న ప్రభుత్వంలో రేషన్ కార్డు వచ్చిందని, మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలని సిద్ధార్థ లే అవుట్‌కి చెందిన సుధారాణి, అమ్మ ఒడి వచ్చిందని షిప్‌యార్డు లే అవుట్‌కి చెందిన కమరుద్దీన్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో తాగునీరు, రోడ్లు, బస్ సౌకర్యం, వీధిలైట్లు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. వెంటనే వాటిని పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్సీ కనక మహాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, 6వ వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక, ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిళ్లా సుజాత, డాక్టర్ గాదే రోశిరెడ్డి, వార్డు అధ్యక్షులు బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, కల్చరల్ విభాగం రీజినల్ ఇన్‌చార్జి వంకాయల మారుతీ ప్రసాద్, పోతిన ప్రసాద్, పోతిన ఎల్లాజీ, పోతిన సూరిబాబు, వి.నరసింహారావు, పొట్నూరి సురేష్, కె.ఈశ్వరరావు, శివ, ఆల్తాఫ్, గుంటబోయిన సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన పూజారి సత్యారావు అస్తమయం



సత్యారావు (ఫైల్)

భీమునిపట్నం: భీమిలి గ్రామదేవత నూకాలమ్మ వారి ఆలయ వంశపారంపర్య ప్రధాన పూజారి, ధర్మకర్త చొదరి సత్యారావు (79) ఆదివారం మృతి చెందారు. నిత్యం అమ్మవారి సేవలో ఉండడంతోపాటు భక్తుల వద్ద ఆయన మంచి గుర్తింపు పొందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం చనిపోయారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మూడో వార్డు ఇన్‌చార్జి మైలిపల్లి షణ్ముఖరావు, పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు సంతాపం తెలిపారు.

రోగుల కోసం వెయిటింగ్ హాల్



రోగుల కోసం నిర్మిస్తున్న వెయిటింగ్ హాల్

పద్మనాభం: మండలంలోని రేవిడి పీహెచ్‌సీలో రోగుల కోసం కొత్తగా వెయిటింగ్ హాల్ నిర్మిస్తున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులు వైద్యులు పరీక్షలు చేసేంత వరకు నిరీక్షించేందుకు వీలుగా నాడు – నేడు నిధులు రూ.17లక్షలతో ఈ హాలు నిర్మిస్తున్నారు. ఇప్పటికే శ్లాబు వరకు నిర్మించారు. ఇంత వరకు రోగులకు వెయిటింగ్ హాల్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కృషితో ఎంపీపీ కంటుబోతు రాంబాబు చొరవతో ఈ హాలు నిర్మిస్తున్నారు. హాలు నిర్మాణం పూర్తయితే రోగులకు ఇబ్బందులు తప్పుతాయి.

వల్లీనగర్‌లో క్షీణించిన పారిశుధ్యం



వల్లీనగర్‌లోని కాలనీలో పేరుకుపోయిన చెత్త

పీఎం పాలెం: జీవీఎంసీ 6వ వార్డు పరిధి వల్లీనగర్‌లో పారిశుధ్యం క్షీణించిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ స్థానిక బహుళ అంతస్తుల భవనాల మధ్య నుంచి కాలువ ప్రవహిస్తోంది. ఈ కాలువలో గతంలో పొక్లెయిన్లు ఉపయోగించి పూడిక పనులు చేపట్టేవారు. చాలా కాలంగా పనులు చేపట్టకపోవడంతో పూడిక విపరీతంగా పేరుకుపోవడంతో దుర్వాసన వ్యాపిస్తోంది. కాలనీలో ఈగలు, దోమల బెడద అధికంగా ఉంది. వెంటనే జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు స్పందించి కాలనీలో పారిశుధ్యం మెరుగుపరచడానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కుటుంబ వ్యవస్థ బాగుంటేనే దేశ ప్రగతి



ఆలయంలో పూజలు చేస్తున్న యూనిట్ సభ్యులు

మధురవాడ: కుటుంబ వ్యవస్థ బాగుంటేనే దేశ ప్రగతి సాధ్యం అవుతుందని, వసుధైక కుటుంబాలే ప్రేమానురాగాలకు చిరునామాగా నిలుస్తున్నాయని ఏపీ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (ఏపీ మా) వ్యవస్థాపకులు ఎం.ప్రసాద్ అన్నారు. పీఎంపాలెంలోని శ్రీదేవి, భూదేవీ సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో 'ఫోర్త్ లైన్ డిజిటల్స్' బ్యానర్‌పై గజపతి శ్రీనివాస్ దర్శకత్వంలో చిత్ర నిర్మాణానికి మంగళవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌తోపాటు దేవాడ పరమేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఈ చిత్రంలో ఉమ్మడి కుటుంబంలోని అనుబంధాలు, ఆప్యాయత, అనురాగాలు ఆవిష్కరిస్తారన్నారు. చిత్రానికి నిర్మాతలుగా చంద్రరావు బొడ్డేపల్లి, స్వర్ణలత కొత్తపల్లి, శ్రీనివాసరావు బసవల వ్యవహరిస్తున్నారని తెలిపారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

మహారాణిపేట : ఆశా డే సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మధురవాడ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, సిబ్బందితో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించాలని, అన్ని అర్బన్, ప్రాథమిక వైద్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. హై రిస్క్ గర్భిణులను గుర్తించి డాక్టర్స్ సలహా నిమిత్తం ఐరన్ పోలిక్ మాత్రలు, పోషకాహారం తీసుకునేటట్లు ప్రోత్సహించాలని సూచించారు. కుటుంబ డాక్టర్ విధానంపై అందరికీ తెలియజేయాలన్నారు. సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు.